
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

ఆదివారం । 31 । మార్చి । 2024



'క్రాఫ్ట్ పేపర్స్'లో అగ్ని ప్రమాదం

మండలంలోని జేగురుపాడు శివార్లలోని శ్రీ మెహర్ గాయత్రీదేవి క్రాఫ్ట్ పేపర్స్ ఎల్ఎల్‌పీ పరిశ్రమలో జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.7 కోట్లు పైగా ఆస్తి నష్టం వాటిల్లింది. - IIలో▸



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం తూర్పు డెల్టాకు 2,472, మధ్య డెల్టాకు 1,607, పశ్చిమ డెల్టాకు 4,300 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆది (సా॥)	సెహరీ సోమ (ఉ॥)
రాజమహేంద్రవరం	6.24	4.36
కాకినాడ	6.24	4.36
అమలాపురం	6.24	4.36

న్యూస్‌రీల్

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.42.47 లక్షలు



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వర స్వామి

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. ఉదయం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి పూర్ణాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు గౌతమీ గోదావరిలో స్నానాలు ఆచరించి స్వామి వార్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఆవరణలో ఉన్న క్షేత్ర పాలకుడు అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామిని సైతం భక్తులు దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే భక్తులు, ఏడు వారాల నోము ఆచరిస్తున్న భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాగణం కిక్కిరిసింది. ఏర్పాట్లను డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ భూపతిరాజు కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ కిషోర్‌కుమార్ మాట్లాడుతూ స్వామి వారికి ప్రత్యేక దర్శనం, అన్నప్రసాద విరాళం, సేవలు, లడ్డూ విక్రయం, విరాళాలు, ఆన్‌లైన్ ద్వారా సుమారు రూ.42,47,223 ఆదాయం సమకూరిందన్నారు. ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ట్రాఫిక్‌ను నియంత్రించి శాంతి భద్రతలను అదుపు చేశారు.



వెంకన్న ఆలయంలో భక్తులు

బాలబాలాజీ ఆలయానికి..



దాత కుటుంబానికి స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఉద్యోగులు

మామిడికుదురు: అప్పనపల్లి బాల బాలాజీ స్వామికి శనివారం రూ.2.13 లక్షలు ఆదాయం వచ్చింది. భారీ సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు తరలి వచ్చారు. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1,56,920 ఆదాయం వచ్చిందని, నిత్య అన్నదానం ట్రస్టుకు భక్తులు రూ.56,123 విరాళంగా అందించారని ఆలయ ఈఓ గ్రంధి మాధవి తెలిపారు. 3,174 మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారని, 2,358 మంది స్వామి వారి అన్న ప్రసాదం స్వీకరించారని చెప్పారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట మండలం కొడమంచిలి గ్రామానికి చెందిన తాళ్లూరి రామచంద్రరావు, సూర్యచంద్రావతి దంపతులు నిత్య అన్నదానానికి రూ.10 వేలు విరాళంగా అందించారన్నారు. దాత కుటుంబానికి ఆలయ ఉద్యోగులు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

వీరేశ్వరుని ఆలయంలో హుండీల లెక్కింపు



వీరేశ్వరస్వామి ఆలయంలో హుండీ సొమ్మును లెక్కిస్తున్న సిబ్బంది

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల శ్రీభద్రకాళి సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో హుండీల ద్వారా రూ.12 లక్షలు ఆదాయం సమకూరినట్లు ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఆలయ ఆవరణలో శనివారం దేవదాయ సహాయ కమిషనర్ నాగమల్లేశ్వరావు, తనిఖీ అధికారి జె.రామలింగేశ్వరావు, ఈఓ సమక్షంలో హుండీలు లెక్కించారు. ఆలయ ప్రధాన హుండీ ద్వారా రూ.5,57,638, నిత్య కల్యాణం వద్ద కట్న కానుకల హుండీ ద్వారా రూ.4,95,233, అన్నదాన హుండీ ద్వారా రూ.1,58,085 వెరసి రూ.12,10,956 సమకూరింది. ఈ మొత్తం 70 రోజుల కాల వ్యవధిలో వచ్చిందన్నారు. వచ్చిన నగదును స్థానిక బీఓబీలో జమ చేస్తున్నట్లు ఈఓ తెలిపారు. ఈ లెక్కింపులో ఆలయ అర్చకులు, గ్రామస్తులు, పురోహితులు, పెన్మత్స వాసురాజు, మట్టపర్తి శివ తదితరులు ఉన్నారు.



రాయవరంలో సాగుతున్న ఉపాధి హామీ పనులు



రాజోలు మండలం మలికిపురంలో కొబ్బరి చెట్లకు పళ్లాలు తీస్తున్న ఉపాధి కూలీలు

శ్రమజీవికి శుభకామన

- ఉపాధి కూలీలకు వేతనం పెంపు
- ఏప్రిల్ 1 నుంచి అమలు
- జిల్లాలో 2,21,719 మందికి లబ్ధి

ఉపాధి వివరాలు	సంఖ్య
మొత్తం జాబ్ కార్డులు	: 2.22 లక్షలు
యాక్టివ్ జాబ్ కార్డులు	: 1,24,137
ఉపాధి కూలీల సంఖ్య	: 3.42 లక్షలు
యాక్టివ్‌గా ఉన్నవారు	: 2.27 లక్షలు

సాక్షి, అమలాపురం: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు నిజంగా శుభవార్త. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి కనీస వేతనం పెరగనుంది. ఇప్పుడు రూ.272 ఉన్న రోజువారీ వేతనం రూ.300 కానున్నది. దీని వల్ల జిల్లాలో 2.27 లక్షల మంది ఉపాధి కూలీలకు మేలు జరగనుంది. ఈ వేతనాన్ని 2025 మార్చి 31వ తేదీ వరకు అంటే రెండేళ్ల పాటు అందించనున్నారు. జిల్లాలో ప్రస్తుతం రబీ వరి కోతలు ఆరంభం కానున్నాయి. ఇవి పూర్తి కాగానే ఉపాధి హామీ పనులు జోరందుకోనున్నాయి.

పెరుగుతున్న జీవన ప్రమాణాలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ఉపాధి వేతనాలను పెంచుతోంది. ఈ పెంపు ఒక్కొక్క రాష్ట్రానికి ఒక్కొక్క విధంగా ఉంటోంది. ఉపాధి హామీ పథకం కేంద్రం ఇస్తున్న లక్ష్యానికి మించి పనులు జరిగేందుకు రాష్ట్రంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెడుతోంది. ఈ కారణంగా వ్యవసాయ పనులు లేని సీజన్‌లో ఉపాధి కూలీలకు నిరంతరం పని దొరుకుతోంది. దీని వల్ల కూలీలకు సముచితమైన వేతనాలందుతున్నాయి. ఇప్పుడు పెరిగిన వేతనం వల్ల కూలీలకు నెలకు వచ్చే ఆదాయం కూడా పెరగనుంది.

జిల్లాలో 22 మండలాలు ఉండగా, 385 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు చేపడుతున్నారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీలలోని పలు ప్రాంతాల్లో పనులు చురుగ్గా సాగుతున్నాయి. జగనన్న ఇళ్ల నిర్మాణ పథకంలో భాగంగా ఒక్కో ఇంటి నిర్మాణానికి 90 రోజుల వంతున పనిదినాలు కల్పిస్తున్నారు. కాలువలు, చెరువుల్లో పూడికతీత పనులు, పుంత రోడ్ల నిర్మాణం, చేలల్లో మెరక మట్టి తవ్వకం, గట్లు పటిష్టం చేయడం, ఎవెన్యూ ప్లాంటేషన్, హార్టికల్చర్ ప్లాంటేషన్, బ్లాక్ ప్లాంటేషన్ తదితర పనులు ఆయా ప్రాంతాల్లో చేపడుతున్నారు.

2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి లేబర్ బడ్జెట్‌ను రూ.149.4 కోట్లుగా నిర్ణయించారు. మార్చి మాసాంతానికి ఈ బడ్జెట్ పూర్తికానుంది. సదరు సొమ్మును ఖర్చు చేయడం ద్వారా 55.98 లక్షల పనిదినాలు కల్పించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ కూలీలకు కనీస వేతనాన్ని పెంచింది. గతంలో రూ. 272 ఉండగా రూ.28 పెంచింది. ప్రస్తుతం దినసరి కూలీ. రూ.300 చేరింది. ఉపాధి హామీ పథకం నిబంధనలు, అధికారులు ఇచ్చిన కొలతల మేరకు పనిచేస్తేనే కనీస వేతనం రూ.300 లభిస్తుంది.

పెరగనున్న సగటు వేతనం

జిల్లాలో ఉపాధి హామీ పథకం పనులు చేసే కూలీలకు సగటు వేతనం రూ.264 చెల్లిస్తున్నారు. పనులు చేసే కొలతలను బట్టి సగటు వేతనాన్ని సిబ్బంది నిర్ణయిస్తారు. కనీస వేతనం రూ.272 ఉండగా సగటు వేతనం రూ.264 వస్తోంది. కనీస వేతనం పెంపు వల్ల సగటు వేతనం మరింత పెరిగే అవకాశం ఉంది. కొత్త జిల్లా ఏర్పడిన తరువాత ఏటా లక్ష్యానికి మించి ఉపాధి పనులు జరుగుతున్నాయి. లక్ష్యాలను రెండు మూడుసార్లు పెంచుకుంటూ పోతున్నారు. సోమవారంతో ఈ ఆర్థిక సంవత్సరం ముగియనుంది. లక్ష్యానికి మించి 55,97,813 పనిదినాలను పూర్తి చేశారు. ఇందుకు సంబంధించిన కూలీల వేతనాన్ని రూ.149.4 కోట్లు ప్రతి ఒక్కరికీ బకాయిలు లేకుండా మొత్తం చెల్లింపులు జరిగాయి. లక్ష్యానికి మించి పనులు జరుగుతున్నందున సగటు వేతనం కూడా పెరగనుంది.

రూ.15.67 కోట్ల మేర లబ్ధి

జిల్లాలో 2,21,719 మంది జాబ్ కార్డుదారులు ఉండగా, వీరిలో 87,115 మంది ఎస్సీ, 1,953 ఎస్టీ, ఇతరులు 1,32,651 మంది ఇతరులు జాబ్‌కార్డులు జారీ చేశారు. వీరిలో యాక్టివ్‌గా ఉన్న కుటుంబాలు ఎస్సీ 58,225, ఎస్టీ 1,129, ఇతరులు 64,783 ఉన్నాయి. ఇదిలా ఉంటే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 27,18,027 మంది ఎస్సీ, 49,368 మంది ఎస్టీ, 28,30,418 మంది ఇతరులకు ఉపాధి పనులు కల్పించారు. వేతనాల రూపంలో వీరికి రూ.149.4 కోట్లు కూలీగా చెల్లించారు. ప్రస్తుతం పెరిగిన దినసరి కూలీ రోజుకు రూ.28 పెరిగింది. ఈ ప్రకారం రూ.15.67 కోట్లు ఉపాధి వేతనదారులకు లబ్ధి చేకూరనుంది.

వేతన పెంపుతో కూలీలకు మేలు



ప్రస్తుతం ఏప్రిల్ 1వ తేదీ నుంచి కనీస వేతనం పెరిగింది. దీంతో మంది కూలీలకు లబ్ధి చేకూరనుంది. కూలీలు పని చేసే దానిని బట్టి వారి సగటు వేతనం పెరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

–ఎస్.మధుసూదనరావు, పీడీ, డ్వామా

వేతనం పెంచడం మంచి నిర్ణయం



పెరుగుతున్న ఖర్చులకు తగ్గట్టుగా మాకు ఉపాధి వేతనం పెంచడం చాలా సంతోషం. ఇంకా ఎక్కువ పెంచుతారని అనుకున్నాం. కొంతే పెంచినా దీని వల్ల మాకు వచ్చే ఆదాయం పెరుగుతోంది. ఉపాధి పని రోజులు కూడా పెంచాలి.

– మొసలి బాలరాజు, మధురపేట, ఉప్పలగుప్తం మండలం

చెక్ పోస్టుల్లో నిరంతర నిఘా

- జిల్లా సరిహద్దు చెక్‌పోస్టులలో ఎస్పీ శ్రీధర్ తనిఖీలు
- నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సిబ్బందికి హెచ్చరిక



బొబ్బర్లంక చెక్ పోస్ట్ వద్ద వాహనాల తనిఖీని పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీధర్

అమలాపురం టౌన్: ఎన్నికల నేపథ్యంలో చెక్ పోస్టుల వద్ద పటిష్ట నిఘా ఏర్పాటు చేసినట్టు ఎస్పీ సుసరాపు శ్రీధర్ పేర్కొన్నారు. శనివారం ఆయన జిల్లా సరిహద్దుల్లోని చెక్ పోస్టులను తనిఖీ చేసి పోలీసు అధికారులకు సూచనలు, అత్యవసర ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ కార్యాలయం ఆ వివరాలను వెల్లడించింది. జిల్లాలో రావులపాలెం మండలం గోపాలపురం, ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక వద్ద ఏర్పాటు చేసిన జిల్లా సరిహద్దు చెక్ పోస్టులను ఎస్పీ శ్రీధర్ సందర్శించి అక్కడి సిబ్బంది వాహనాలను తనిఖీ చేస్తున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ శ్రీధర్ మాట్లాడుతూ చెక్ పోస్టుల్లోని సిబ్బంది అలసత్వం వహిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. 24 గంటల పాటు సిబ్బంది తనిఖీలతో పాటు, ప్రతి చెక్‌పోస్టు వద్ద సీసీ కెమెరాల నిఘా ఉందన్నారు. స్వయంగా ఆయన సైతం వాహనాలను తనిఖీ చేయడం గమనార్హం. జిల్లాలో ఎక్కడా గంజాయి, నాటు సారా, మద్యం, అక్రమ నగదు రవాణా కాకుండా సిబ్బంది అడ్డుకోవాలని సూచించారు. తనిఖీ సమయాల్లో వాహన చోదకులతో మర్యాదగా మాట్లాడాలని, తనిఖీల్లో ఏదైనా అక్రమంగా రవాణా అవుతున్నట్టు అనుమానం వస్తే, ఆ సమాచారాన్ని తక్షణమే పై అధికారులకు చెప్పాలని వివరించారు. ఎస్పీ వెంట కొత్తపేట డీఎస్పీ రమణ, రావులపాలెం, కొత్తపేట పోలీసు అధికారులు ఉన్నారు.

ముగిసిన సైనిక విన్యాసాలు

- తిరుగుపయనమైన భారత్ – అమెరికా దళాలు
- నేటి నుంచి బీచ్ రోడ్డులో రాకపోకలకు అనుమతి



నింగి, నేల, నీరు.. ఎక్కడైనా శత్రువుకు దడ పుట్టిస్తాం : కాకినాడ తీరంలో చివరి రోజు ఆకట్టుకున్న త్రివిధ దళాల విన్యాసాలు

కాకినాడ రూరల్: భారత్ – అమెరికా రక్షణ దళాలు ఐదు రోజులుగా కాకినాడ సాగర తీరంలో నిర్వహిస్తున్న సంయుక్త సైనిక విన్యాసాలు శనివారం ముగిశాయి. టైగర్ ట్రయాంఫ్ పేరిట మూడో ఎడిషన్‌గా చేపట్టిన ఈ విన్యాసాలు ఈ నెల 18న విశాఖపట్నంలో హార్బర్ ఫేజ్‌తో ప్రారంభమయ్యాయి. దీనికి కొనసాగింపుగా రెండో దశలో కాకినాడ సీ ఫేజ్‌లో ఈ నెల 26న యాంఫిబియస్ (ఉభయచర) విన్యాసాలు చేపట్టారు.

ఇందులో భారత్‌కు చెందిన త్రివిధ దళాల అధికారులు, సైనికులు సుమారు 700 మంది, అమెరికా రక్షణ దళ అధికారులు, సైనికులు 350 మంది ఈ విన్యాసాల్లో పాల్గొని, యుద్ధ నైపుణ్యాలను పరస్పరం పంచుకున్నారు. యుద్ధ నౌకలు, యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, అధునాతన ఆయుధాలు, యుద్ధ ట్యాంకుల వంటి వాటితో ఈ విన్యాసాలు నిర్వహించారు. వీటిని ఇరు దేశాల రక్షణ దళాల అధికారులు స్వయంగా పరిశీలించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. చివరి రోజున పలు రకాల ఎక్సర్‌సైజ్‌లు నిర్వహించారు. అనంతరం తూర్పు నౌకాదళ సిబ్బంది యుద్ధ నౌకలతో విశాఖకు, సైనిక దళాలు రోడ్డు మార్గంలో తిరుగు పయనమయ్యాయి. సైనిక విన్యాసాల కారణంగా ఈ నెల 25వ తేదీ సాయంత్రం నుంచి కాకినాడ – ఉప్పాడ మధ్య మూసివేసిన బీచ్ రోడ్డుపై ఆదివారం ఉదయం నుంచి యథాతథంగా రాకపోకలను అనుమతిస్తామని పోలీసులు తెలిపారు.

జనసేనపై టీడీపీ కుట్ర

- అమలాపురం అసెంబ్లీ స్థానంపై పవన్ కల్యాణ్ పునరాలోచించాలి
- స్పందించకుంటే తదుపరి నిర్ణయం తీసుకుంటానన్న శెట్టిబత్తుల



అభిమానుల సంఘ సమావేశంలో మాట్లాడుతున్న జనసేన నాయకుడు శెట్టిబత్తుల రాజబాబు

అల్లవరం: అమలాపురం అసెంబ్లీ స్థానాన్ని జనసేనకు కేటాయించకుండా టీడీపీ కుట్ర చేసిందని, జనసేన నాయకులు శెట్టిబత్తుల రాజబాబు అన్నారు. టీడీపీ కుట్రతో ఆ స్థానానికి తాము పోటీ చేసే అవకాశం కోల్పోయామని ఆయన అన్నారు. అల్లవరం మండలం గుడ్డివానిచింత సత్యకస్తూరి ఫంక్షన్ హాల్లో శెట్టిబత్తుల అభిమానుల సంఘం పేరిట శనివారం సమావేశం నిర్వహించారు. జనసేన నాయకులు సందాడి శ్రీను అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాజబాబు మాట్లాడుతూ ఐదేళ్లుగా జనసేన పార్టీని బలోపేతం చేసి అమలాపురంలో బలమైన శక్తిగా తయారుచేశానని, డిసెంబర్ 14 జరిగిన సమావేశంలో అమలాపురం అసెంబ్లీ స్థానానికి జనసేన పోటీ చేస్తుందని పవన్ కల్యాణ్ స్పష్టమైన హామీ ఇచ్చారని తెలిపారు. మరునాడే ఆ స్థానానికి టీడీపీ, పి.గన్నవరం అసెంబ్లీ స్థానానికి జనసేన తరఫున ఐవీఆర్ సర్వే జరిగిందన్నారు. అప్పటి వరకు జనసేనకే సీటు అనుకున్న తరుణంలో రాత్రికి రాత్రే నా రాజకీయ జీవితంపై టీడీపీ కుట్ర చేసి తనకు సీటు లేకుండా చేశారని రాజబాబు ఆరోపించారు. ఇప్పటికైనా జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ అమలాపురం అసెంబ్లీ సీటు విషయాన్ని పునరాలోచించాలన్నారు. ఆ స్థానాన్ని జనసేనకు కేటాయిస్తే పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీని గెలిపించుకుంటామని రాజబాబు తెలిపారు. జనసేన పార్టీకి సీటు కేటాయిస్తే ప్రచారానికి కావలసిన నగదుని సమకూర్చుకోవాలని ప్రయత్నిస్తే వైఎస్సార్ సీపీ నాయకుల్ని కవలడానికి వెళ్లారని చిత్రీకరించారని రాజబాబు అన్నారు. తమ పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌ను త్వరలో కలుస్తానని అప్పటికి అధిష్టానం స్పందించి సరైన నిర్ణయం తీసుకోకపోతే వారం రోజుల్లో అభిమానులతో కలసి తదుపరి నిర్ణయం తీసుకుంటామని రాజబాబు తెలిపారు. పార్టీలో సీటు కేటాయించినా, కేటాయించకపోయినా కార్యకర్తల వెంటే ఉంటానని రాజబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమలాపురం, ఉప్పలగుప్తం, అల్లవరం మండలాల నుంచి జనసేన పార్టీకి చెందిన కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

ప్రైవేటు విద్యావకాశాన్ని విడువద్దు..

- నేడే తుది గడువు
- విద్యాహక్కు చట్టం అమలులో భాగంగా ఒకటో తరగతిలో ప్రవేశాలు
- జిల్లాలో ఇప్పటి వరకు 3,076 మంది దరఖాస్తు



జిల్లాలో పరిస్థితి ఇదీ..

రాయవరం: ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం సెక్షన్ 12(1)(సి) ప్రకారం ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు ఇవ్వాల్సి ఉంది. గత ప్రభుత్వాల నుంచే చట్టం ఉన్నప్పటికీ, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ చట్టాన్ని కచ్చితంగా అమలు చేస్తోంది. గత విద్యా సంవత్సరంలో కూడా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ చట్టాన్ని అమలు చేసి 570 మంది విద్యార్థులకు ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలు కల్పించారు. 2024–25 విద్యా సంవత్సరానికి ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతి ప్రవేశానికి ప్రస్తుత విద్యా సంవత్సరంలోనే నోటిఫికేషన్ విడుదల చేసి, మొదటి విడత జాబితాను కూడా విడుదల చేసింది. జిల్లాలో ఒకటో తరగతిలో ప్రవేశానికి 1203 మందికి అవకాశం కల్పించారు. వచ్చే విద్యా సంవత్సరానికి ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేసిన విషయం పాఠకులకు విదితమే. ఈ గడువు ఆదివారం అర్ధరాత్రితో ముగియనుంది.

విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు విధిగా కేటాయించాల్సి ఉంది. ఈ ప్రకారం జిల్లా పరిధిలో 347 ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలలు ఇప్పటికే సీఎస్‌ఈ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నాయి. పాఠశాల విద్యాశాఖ జిల్లాల వారీగా ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల జాబితాను ఆయా జిల్లాల విద్యా శాఖాధికారులకు గతంలోనే పంపించి, సీఎస్‌ఈ వెబ్‌పోర్టల్‌లో నమోదయ్యేలా చర్యలు చేపట్టింది. దీంతో ఐబీ/ఐసీఎస్‌ఈ/సీబీఎస్‌ఈ/స్టేట్ సిలబస్‌లు అమలవుతున్న ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలలు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.

నేటితో ముగియనున్న గడువు

గత మార్చి నెలలో ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం ఆసక్తి ఉన్న తల్లిదండ్రులు దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా పరిధిలో 3,076 మంది ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల్లో 2,576 మంది చిన్నారుల తల్లిదండ్రులు వారు ఏ పాఠశాలలో సీటు కోరుకుంటున్నారో ఎంపిక చేసుకోవడం జరిగింది. ఇంకా 500 మంది వారు కోరుకునే పాఠశాలలను ఎంపిక చేసుకోవాల్సి ఉంది. దరఖాస్తు గడువు ముగిసిన అనంతరం దరఖాస్తుదారుల్లో అర్హులైన వారిని ఎంపిక చేసి, మొదటి విడత జాబితాను విడుదల చేయనున్నారు. మండలాల వారీగా ఎంపికైన చిన్నారుల జాబితాలో విద్యార్థి దరఖాస్తు ఐడీ, వారు ఏ సచివాలయం పరిధిలో ఉన్నారు.. వారిని ఏ ఏ పాఠశాలలకు కేటాయిస్తున్నారో తెలియజేయనున్నారు. ఆ ప్రకారం సంబంధిత విద్యార్థులు ఆయా పాఠశాలల్లో అడ్మిషన్ ఇచ్చే విధంగా జిల్లా విద్యాశాఖ పర్యవేక్షిస్తుంది.


ఆదేశాలు కచ్చితంగా పాటించాలి



విద్యాహక్కు చట్టం ప్రకారం పేద విద్యార్థులకు ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటవ తరగతిలో ప్రవేశానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. విద్యార్థుల తల్లిదండ్రులు దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

పాఠశాలలను ఎంపిక చేసుకోవాలి



ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలలను ఎంపిక చేసుకోవాలి. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని వారు చివరి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం

జాతీయ యోగా పోటీలకు ముగ్గురు విద్యార్థులు



విద్యార్థులతో భైరవస్వామి, యోగా గురువు డాక్టర్ శ్రీనివాస్

అమలాపురం టౌన్: స్థానిక శ్రీ స్వామి వివేకానంద యోగాశ్రమం విద్యార్థులు జాతీయ యోగా పోటీలకు ఎంపికయ్యారు. ఆశ్రమానికి చెందిన బి.మేఘన, వి.శ్రావణి, వి.సారిక జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటి ఈ పోటీలకు ఎంపికయ్యారని ఆశ్రమ గురువు డాక్టర్ ఆకుల శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 25న అనకాపల్లిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో వారు ప్రథమ స్థానంలో నిలిచారని, త్వరలో గుజరాత్ రాష్ట్రంలో జరగనున్న జాతీయ యోగా పోటీల్లో వారు పాల్గొంటారని ఆయన తెలిపారు. మాజీ జాతీయ యోగా న్యాయ నిర్ణేత మోటూరి భైరవస్వామి విద్యార్థులను ప్రశంసించారు.

క్లుప్తంగా

మూణ్నాళ్ల మురిపెం! ఆ సిరా గురుతు!!



అంబాజీపేట: 'నీ వేలిపై సిరా చుక్క దేశ ప్రగతికి వేగు చుక్క' అంటూ ఎన్నికల సంఘం ఓటు విలువను తెలియజేస్తుంటుంది. ఓటు హక్కును వినియోగించుకున్న ప్రతి వ్యక్తికీ ఎడమచేతి బొటన వేలిపై సిరా చుక్క పెడతారు. చేతి వేళ్లులేని దివ్యాంగులకు కాలి వేళ్లకు సిరా చుక్క పెడతారు. ఇది ఓటేశామని గుర్తు మాత్రమే కాదు. దొంగ ఓట్లను నిరోధించే ఆయుధం. ఎన్నికలలో వాడే ఇండెలిబుల్ ఇంక్ వేలిపై పెడితే 72 గంటల పాటు చెరిగిపోదు. ఈ సిరాను 1962 నుంచి కర్ణాటకలోని మైసూర్ పెయింట్స్ అండ్ వార్నిష్ కంపెనీ తయారు చేస్తోంది. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా ఆ కంపెనీ నుంచే సిరా సరఫరా అవుతుంది. సిరాలో 7.25 శాతం సిల్వర్ నైట్రేట్ ఉండడంతో ఎక్కువ కాలం చెరిగిపోకుండా ఉంటుంది.

ఆబోతు మృతదేహం ఊరేగింపు



వాడపాలెంలో ఆబోతు మృతదేహాన్ని ఖననం చేస్తున్న దృశ్యం

కొత్తపేట: మండలంలోని వాడపాలెంలో ఒక ఆబోతు మృతి చెందగా దానిని గ్రామంలో ఊరేగించి, ఖననం చేశారు. గ్రామానికి చెందిన రంకిరెడ్డి త్రిమూర్తులు, శ్రీనివాస్ అనే తండ్రీ, తనయులు సుమారు ఐదేళ్ల క్రితం ఆవుకు, ఆబోతుకు పెళ్లి చేసి ఆబోతును గ్రామంలో వదిలారు. దాంతో ఆ ఆబోతు వాడపాలెం, పరిసర పనసలదొడ్డి, పెదరాముడినూతిమెరక, చినరాముడినూతిమెరక తదితర శివారు గ్రామాల్లో తిరుగుతూ ఉండేది. ఈ ఆబోతు శుక్రవారం వాడపాలెంలో ఒకరి ఇంటి సెప్టిక్ ట్యాంక్‌లో పడి మృతి చెందింది. ఆబోతు మృతదేహాన్ని అతి కష్టం మీద బయటకు తీయగా ఆబోతును వదిలిన త్రిమూర్తులు కుటుంబం ఆ ఆబోతు మృతదేహాన్ని తమ ఇంటికి తీసుకువెళ్లి పూజలు నిర్వహించి, ట్రాక్టరుపై గ్రామంలో మేళతాళాలతో ఊరేగించారు. అనంతరం తమ సొంత భూమిలో ఖననం చేయించారు.

జగన్‌ను సీఎం చేయడమే లక్ష్యం

మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ



ముద్రగడను ఆయన నివాసంలో కలుసుకున్న ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నాయకులు, గూడూరి శ్రీనివాస్, జక్కంపూడి గణేశ్

కిర్లంపూడి: రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని అధికారంలోకి తీసుకురావడమే ప్రధాన లక్ష్యంగా నాయకులు, కర్యకర్తలు పనిచేయాలని మాజీ మంత్రి, కాపు ఉద్యమనేత, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం అన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుంచి సుమారు 150 మంది నాయకులు, కార్యకర్తలు శనివారం ముద్రగడను, యువ నాయకుడు గిరిబాబును వారి నివాసంలో మార్యాద పూర్వకంగా కలిశారు. రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గం ఇన్చార్జి, ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జక్కంపూడి గణేశ్ ముద్రగడను మర్యాద పూర్వకంగా కలిశారు. ఎన్నికల ప్రచారానికి తీసుకోవాలసిన ప్రణాళికలపై వారితో చర్చించారు. ఈ సందర్భంగా ముద్రగడ మాట్లాడుతూ నిరుపేదలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. మరిన్ని సంక్షేమ పథకాలతో పాటు రాష్ట్రాభివృద్ధికి రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ముద్రగడ పద్మనాభం వైఎస్సార్ సీపీలోకి రావడం పార్టీకి మరింత బలం చేకూరిందన్నారు. రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గాల్లో సేవలందించేదుకు ముద్రగడను ఆహ్వానించినట్టు తెలిపారు. రానున్న ఎన్నికల్లో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని 7 నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధిస్తుందన్నారు. పశ్చిమగోదావరి జిల్లా రాష్ట్ర కాపు జేఏసీ సభ్యుడు తోట రామకృష్ణ, జిల్లా కాపు సంఘం అధ్యక్షుడు చిన్నిమిల్లి వెంకటరాయుడు, గణేశుల రాంబాబు, నీలి ఆనంద్, అడపా అనిల్, ఇసుకపల్లి శ్రీను, గణేశుల లచ్చబాబు, గౌతు స్వామి తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ జ్యువెలరీ షోరూమ్ ప్రారంభం



సీఎంఆర్ జ్యువెలరీ ప్రారంభోత్సవంలో పాల్గొన్న సినీ నటి అమృత అయ్యర్, సంస్థ ఎండీ మావూరి వెంకటరమణ తదితరులు

కాకినాడ సిటీ: నగరంలో సీఎంఆర్ జ్యువెలరీ ఎక్స్‌క్లూజివ్ షోరూమ్‌ను హనుమాన్ ఫేమ్ హీరోయిన్, సినీ నటి అమృత అయ్యర్, రాష్ట్ర రైస్ మిల్లర్ల అసోసియేషన్ చైర్మన్ ద్వారంపూడి వీరభద్రారెడ్డి, కౌడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, గోదావరి చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ పెద్ది రత్నాజీ, సీఎంఆర్ గ్రూప్ ఫౌండర్ అండ్ చైర్మన్ మావూరి వెంకటరమణ తదితరులు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మావూరి వెంకటరమణ మాట్లాడుతూ కాకినాడలో అతి పెద్ద బంగారు ఆభరణాల ఎక్స్‌క్లూజివ్ షోరూమ్ ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. వినియోగదారుల శైలికి తగ్గట్టుగా ప్రాచీనత నుంచి ఆధునికత వరకు అన్ని రకాల ఆభరణాలు అందుబాటులో ఉంచామన్నారు. తమ షోరూమ్‌లో బంగారు ఆభరణాలపై అతి తక్కువ తరుగు 3 శాతం నుంచి ప్రారంభం అన్నారు. వెండి వస్తువులపై తరుగు, మజూరీ లేదన్నారు. దాదాపు ఐదు దశాబ్దాలుగా ఆభరణాల వ్యాపారంలో అత్యంత సుప్రసిద్ధమైన సంస్థల్లో ఒకటిగా ఖ్యాతి గడించిన సంస్థ సీఎంఆర్ ఎక్స్‌క్లూజివ్ జ్యువెలరీ షోరూమ్ అని సినీనటి అమృత అయ్యర్, ద్వారంపూడి వీరభద్రారెడ్డి అన్నారు. సీఎంఆర్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ మావూరి మోహన్ బాలాజీ మాట్లాడుతూ మార్కెట్‌లో ప్రస్తుత ట్రెండ్‌కి అనుగుణంగా లేటెస్ట్ కలెక్షన్లతో సీఎంఆర్ ఎక్స్‌క్లూజివ్ షోరూమ్‌ను కాకినాడ దేవాలయం వీధిలో ఏర్పాటు చేశామన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా గ్రాముకు రూ.250 వరకు తగ్గింపు ప్రకటించినట్టు తెలిపారు. కార్యక్రమంలో కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ మేనేజర్ వైఎల్ చౌదరి, ప్రముఖ వ్యాపారవేత్త రాపాక వెంకట్ ఆనంద్, బాదం సుందరరావు, పి.మంగరాజు, గొడవర్తి లక్ష్మీ లావణ్య, మేనేజర్లు బి.రమేష్‌కుమార్, ఆసిఫ్ ఇక్బాల్, లయన్ రాజు, మాజీ కార్పొరేటర్ బన్నీ పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశాల గడువు పెంపు

తుని రూరల్: ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి గడువు పెంచినట్టు కన్వీనర్, తుని పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ఎంటీ హేమలత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తుని (బాలికలు), భూపతిపాలెం (బాలురు) ఐదో తరగతి అన్ని సీట్లు, ఆరు, ఏడు, ఎనిమిది తరగతుల్లో మిగిలిన సీట్లు, ఇంటర్మీడియట్, డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల గడువు వచ్చే నెల ఐదో తేదీ వరకు పొడిగించినట్టు ఆమె పేర్కొన్నారు. 2024–25 సంవత్సరానికి ఈ నెల 31తో గడువు ముగిసిందని, గడుపు పెంపును ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో చదువుకున్న విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. ఆసక్తి, అర్హతగల విద్యార్థులు ఏపీఆర్ఎస్.ఏపీఎఫ్ఎస్ఎస్.ఐఎన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 87126 25029 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు.

'క్రాఫ్ట్ పేపర్స్'లో అగ్ని ప్రమాదం


- రూ.7 కోట్లకు పైగా ఆస్తినష్టం
- పరిశీలించిన డీఎస్పీ అంబికా ప్రసాద్



పరిశ్రమలో చెలరేగిన మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కడియం: మండలంలోని జేగురుపాడు శివార్లలోని శ్రీ మెహర్‌గాయత్రీదేవి క్రాఫ్ట్‌పేపర్స్ ఎల్ఎల్‌పీ పరిశ్రమలో 28వ తేదీ తెల్లవారు జామున అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో సరఫరాకు సిద్ధంగా ఉన్న క్రాఫ్ట్ పేపర్‌తో పాటు, యంత్ర సామగ్రి కూడా మంటల్లో చిక్కుకుని దెబ్బతిందని బాధితులు తెలిపారు. ఈ మేరకు సదరు మిల్లు మేనేజర్ మండపేట మండలం గొల్లపూడికి చెందిన కంతంశెట్టి మల్లికార్జున రావు కడియం పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. నిల్వ ఎక్కువగా ఉండడంతో రెండు నెలలుగా మిల్లు నిలిపివేశామని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే 28వ తేదీ తెల్లవారు జామున తమ యజమాని వల్లూరి మెహర్ చైతన్యకు సెక్యూరిటీ నుంచి అగ్ని ప్రమాదం విషయమై ఫోను వెళ్లిందన్నారు. ఆయన తనకు సమాచారం ఇచ్చారని వెంటనే తాను ప్రమాదస్థలికి చేరుకున్నానన్నారు. రాజమహేంద్రవరం, మండపేట, అనపర్తిలకు చెందిన ఫైర్ ఇంజిన్లు వచ్చి మంటలను ఆర్పాయన్నారు. ఈ ప్రమాదంలో సరఫరాకు సిద్ధంగా ఉన్న క్రాఫ్ట్‌పేపర్, యంత్రసామగ్రి తదితర వస్తువులు కాలిపోవడంతో ఏడు కోట్ల రూపాయల వరకు నష్టం సంభవించిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. మిల్లు మేనేజర్ ఫిర్యాదు మేరకు రాజమహేంద్రవరం దక్షిణ మండలం డీఎస్పీ అంబికా ప్రసాద్, కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్ తమ సిబ్బందితో అక్కడికి చేరుకుని విచారణ ప్రారంభించారు. అలాగే అగ్నిమాపక సిబ్బంది, విద్యుత్, పరిశ్రమల శాఖ సిబ్బందికి కూడా ఘటనా స్థలానికి చేరుకుని ఫిర్యాదు చేసారు. కాగా ఊరికి దూరంగా మిల్లు ఉండడంతో పాటు, గత కొన్నాళ్లుగా పనిచేయకపోవడంతో ప్రమాద సమాచారం బయటకు రావడం ఆలస్యమైంది. ఇదిలా ఉండగా ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది.

పవన్ వస్తారని పాదగయకు నో ఎంట్రీ



పాదగయ క్షేత్రంలో గేట్లు మూసి భక్తులను నిలిపివేసిన అధికారులు

పిఠాపురం: జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ పాదగయలో పూజలు నిర్వహిస్తారనే సమాచారంతో అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారు. కాకినాడ బైపాస్ రోడ్డు వైపు ఉన్న పాదగయ క్షేత్రం గేట్లు మూసివేసి భక్తులను రానివ్వకుండా అడ్డుకోవడంతో భక్తులు ఆందోళన వ్యక్తం చేశారు. సుదూర ప్రాంతాల నుంచి స్వామి, అమ్మవార్ల దర్శనం కోసం వచ్చిన తమను రాజకీయ నాయకులు వస్తున్నారనే వంకతో ఆలయంలో ప్రవేశం లేదని నిలిపివేయడం ఎంత వరకు సమంజసమంటూ ప్రశ్నించారు. సాయంత్రం 4 గంటల నుంచి ఆరు గంటల వరకు దర్శనాలు నిలిపివేయడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆరు గంటలకు పవన్‌కల్యాణ్ పర్యటన వాయిదా పడిందనే సమాచారంతో భక్తులను అనుమతించారు.

రివర్‌బేపై విజిలెన్స్ దాడులు



హోటల్ రివర్ బేలో తనిఖీలు చేస్తున్న అధికారులు

- 25శాతం టీపీసీ దాటిన వంటనూనె
- కార్పొరేషన్‌కు రూ.13.77 లక్షల బకాయిల గుర్తింపు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం సిటీ): స్టార్ హోటల్‌గా పేరొందిన గోదావరి గట్టున ఉన్న రివర్ బే హోటల్‌ను శనివారం విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ, రెవెన్యూ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ దాడుల్లో వంటనూనె 25 శాతం టోటల్ పోలార్ కాంపౌండ్ (టీపీసీ) దాటి ఉండడాన్ని గుర్తించారు. అంతేగాక మరిన్ని అక్రమాలను గుర్తించారు. హోటల్ నుంచి ఫుడ్ సేఫ్టీ అధికారులు చికెన్ ఫ్రై నమూనాలను సేకరించి ఫుడ్ లాబొరేటరీకి పంపించారు. అదే విధంగా హోటల్‌లో ఉపయోగిస్తున్న ఎడిబుల్ ఆయిల్స్‌లో టోటల్ పోలార్ కాంపౌండ్స్ మీటర్ రీడింగ్ 25 శాతం లోపు ఉండాల్సి వుండగా దానికన్న ఎక్కువగా ఉండడంతో ఫుడ్ సేఫ్టీ అధికారులు జాయింట్ కలెక్టర్ కోర్టులో కేసు నమోదు చేశారు. అంతే కాకుండా హోటల్ యాజమాన్యం రూ.13,77,220 మున్సిపల్ కార్పొరేషన్ డిమాండ్ నోటీసు ప్రకారం ట్రేడ్ లైసెన్సు ఫీజు బకాయి ఉన్నట్లు గుర్తించారు. హోటల్‌లో స్టాంప్ లేని తూకం యంత్రం ఉండడంతో లీగల్ మెట్రాలజీ అధికారులు వేయింగ్ మెషీన్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. జీఎస్టీ రిటర్న్‌లు సెప్టెంబర్–2023 నుండి ఫైల్ చేయనట్టు గుర్తించినట్టు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో హోటల్స్, రెస్టారెంట్లలో కిచెన్లు పరిశుభ్రంగా వుంచాలని, రెస్టారెంట్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు సూచనల మేరకు వినియోగదారులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారపదార్థాలు అందించాలని, లేకపోతే సంబంధిత రెస్టారెంట్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి అన్నారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ అధికారులు ముత్యాలు నాయుడు, శ్రీనివాస రెడ్డి, నాగ వెంకట రాజు, భార్గవ్ మహేష్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రుక్కయ్య, లీగల్ మెట్రాలజీ అధికారి సాల్మాన్ రాజు, వలి, శివ పాల్గొన్నారు.

ఆహ్వానం లేదు.. ఫొటోకూ చోటు లేదా!

- నియోజకవర్గ సమావేశానికి జవహర్‌కు అందని ఆహ్వానం
- అలంకారప్రాయంగా జాతీయ ప్రధాన కార్యదర్శి పదవి
- మాజీ మంత్రికి తప్పని పరాభవం
- దళితుడనే వివక్ష అంటూ ఆయన వర్గీయుల ఆగ్రహం
- టీడీపీలో సద్దుమణగని విభేదాలు



జవహర్‌కు మద్దతుగా తాడేపల్లిలోని టీడీపీ రాష్ట్ర కార్యాలయం వద్ద దళిత ప్రజా సంఘాల ఆందోళన

కొవ్వూరు: 'పదవి గొప్ప.. మర్యాద సున్నా' అన్నట్టుగా ఉంది మాజీ మంత్రి కేఎస్ జవహర్ పరిస్థితి. మాజీ మంత్రి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు అయిన ఆయన తాజాగా ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా కూడా నియమితులయ్యారు. ఎంత చరిత్ర ఉంటేనేం.. ఎన్ని పదవులు ఉంటేనేం.. కొవ్వూరులో శనివారం నిర్వహించిన టీడీపీ నియోజకవర్గ స్థాయి సమావేశానికి ఆయనకు కనీస ఆహ్వానం కూడా లేదు. సార్వత్రిక ఎన్నికల్లో కొవ్వూరు అసెంబ్లీ స్థానానికి టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా ముప్పిడి వెంకటేశ్వరరావు పేరు ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత తొలిసారిగా మూడు పార్టీలతో టీడీపీ నేత పెండ్యాల అచ్చిబాబు ఆధ్వర్యాన ఈ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఇంతటి ప్రాధాన్యం కలిగిన ఈ సమావేశానికి జవహర్‌కు ఆహ్వానం లేకపోగా.. ఆ వేదికపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో సైతం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి హోదాలో ఉన్న ఆయన ఫొటోకు చోటు దక్కలేదు. దీనినిబట్టి దళిత సామాజికవర్గ నేతకు టీడీపీలో దక్కిన గౌరవం ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు.

దళితులపై చిన్నచూపు

కేవలం దళిత నేత కావడమే ఆయన చేసిన పాపమా? అంటూ టీడీపీ దళిత నాయకులు మండిపడుతున్నారు. ఆ పార్టీలో దళితులపై వివక్ష చూపుతున్నారనడానికి ఇదే నిదర్శనమని ఆరోపిస్తున్నారు. తానెవరికీ తలవంచే ప్రసక్తే లేదని, పెత్తందార్ల పైనే తన పోరాటమని, పార్టీకి బానిసగా పని చేస్తానని పలు సందర్భాల్లో జవహర్ ఇప్పటికే ప్రకటించారు. అందుకే పెత్తందార్ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి జవహర్‌ను ఆహ్వానించలేదంటూ దళిత నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ సమావేశానికి జవహర్ వర్గీయులు గైర్హాజరయ్యారు. టీడీపీలో పెత్తందార్ల హవానే నడుస్తోందని చెప్పడానికి ఈ సమావేశమే ఓ ఉదాహరణని విమర్శిస్తున్నారు.

టీడీపీ రాష్ట్ర కార్యాలయం వద్ద ధర్నా

మరోవైపు జవహర్‌కు కొవ్వూరు టికెట్ కేటాయించాలని కోరుతూ దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యాన తాడేపల్లిలోని టీడీపీ రాష్ట్ర కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ప్లకార్డులు, ఫ్లెక్సీలతో నిరసన తెలిపారు. ఈ ఆందోళనలో రాష్ట్ర వ్యాప్తంగా పలువురు దళిత, ప్రజా సంఘాలు, మాదిగ దండోరా నేతలు పాల్గొని పార్టీ పెద్దలకు వినతి పత్రం సమర్పించారు. గుంటూరు, కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన డప్పు కళాకారులు, చర్మకారులు, ఎంఆర్‌పీఎస్ నాయకులతో పాటు నియోజకవర్గ దళిత నాయకులు కూడా ఈ ఆందోళనలో పాల్గొన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో జవహర్‌కు టికెట్టుపై టీడీపీలో మరోసారి రచ్చ నడుస్తోంది. తాను పోటీలో ఉంటానని జవహర్ ఇప్పటికే ప్రకటించగా.. ఆయనను అచ్చిబాబు వర్గం పూర్తిగా పక్కన పెట్టి దూకుడుగా వ్యవహరించడంతో విభేదాలకు మళ్లీ ఆజ్యం పోసినట్టయ్యింది. ఎన్నికల వేళ టీడీపీలో విభేదాలు సద్దుమణగకపోవడం చూసి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు తలలు పట్టుకుంటున్నారు.

సరైన పత్రాలు లేని 679 చీరలు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న చీరలు

గోపాలపురం: హైదరాబాదు నుంచి విశాఖపట్టణానికి అనధికారికంగా తరలిస్తున్న 679 పట్టుచీరలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై కర్రి సతీష్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు హైదరాబాద్ నుంచి విశాఖకు ప్రైవేటు బస్సులో 10 బాక్సులలో 679 చీరలను తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు అంతర్ జిల్లా సరిహద్దు జగన్నాథపురం చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహించామని, ఎటువంటి ఆధారాలు లేవని తేలడంతో వాటిని స్వాధీనం చేసుకుని వాణిజ్యపన్నుల విభాగానికి అప్పగించినట్లు ఎస్సై చెప్పారు.